క్లుప్తంగా

క్వారీ స్థలం చుట్టూ ఫెన్సింగ్



నాదెండ్ల: జాతీయ రహదారిపై గణపవరం సీఆర్ కళాశాల ఎదురుగా ఉన్న జిల్లా పరిషత్‌కు చెందిన క్వారీ స్థలం చుట్టూ గ్రామ పంచాయతీ అధికారులు ఫెన్సింగ్ వేశారు. ఈ స్థలంలో స్థానికంగా ఉన్న కంపెనీల వ్యర్థాలు, ఇళ్ల వ్యర్థాలు పడవేస్తుండటంతో డంపింగ్ యార్డును తలపిస్తోంది. అంతేకాక వ్యర్థాలకు నిప్పు పెడుతుండటంతో దట్టమైన పొగ రహదారిపై వ్యాపించి వాహనచోదకులకు దారి కనిపించక సమస్యగా మారింది. పొగ కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వ్యర్థాల నుంచి వెలువడే దుర్వాసన, పొగ కారణంగా ఇబ్బందులు పడుతున్నామంటూ సీఆర్ కళాశాల విద్యార్థులు స్థానిక అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో పంచాయతీ అధికారులు స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేయటంతో పాటూ వ్యర్థాలను పడవేసే వారిపై చర్యలు తీసుకుంటామని బోర్డును ఏర్పాటు చేశారు.

మహాశివుడికి వెండి నాగాభరణం సమర్పణ



యడ్లపాడు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మహాశివునికి వెండి నాగాభరణాన్ని భక్తులు సమర్పించారు. మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల కాలంలో గుర్తు తెలియని దుండగులు ఆలయంలో దూరి బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేశారు. దీంతో గ్రామానికి చెందిన బళల హరినారాయణ, సీతారావమ్మ కుటుంబ సభ్యులు రూ.లక్ష విలువైన వెండి నాగాభరణాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో ఆలయ ధర్మకర్త సాంబశివరావుకు సమర్పించారు. వెంటనే స్వామివారికి వాటిని అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. దాతలు సీతారావమ్మ, కుమారుడు, కోడలు బళల వెంకటేశ్వరరావు, పుష్పలత, గ్రామస్తులు పాల్గొన్నారు.

శోభాయమానంగా గిరి ప్రదక్షిణ



వినుకొండ: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని రామలింగేశ్వరస్వామి కొలువైన వినుకొండ కొండ చుట్టూ విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. కొండమెట్ల వద్ద ఉన్న శ్రీ వరసిద్ధి వినాయక దేవస్థానం నుంచి ప్రారంభమైన ఈ గిరి ప్రదక్షిణ కొండ చుట్టూ తిరిగి మళ్లీ కొండమెట్ల వద్ద ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి గుడి వద్ద ముగిసింది. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు భాగవతుల రవికుమార్, గజవల్లి నాగపవన్‌కుమార్, జనసేన నాయకులు నిశ్శంకర శ్రీనివాసరావు, కొంజేటి నాగ శ్రీను రాయల్, బీజేపీ నాయకుడు మేడం రమేష్ పాల్గొన్నారు.

రేపు మైదవోలు ఎంపీపీఎస్‌లో వైజ్ఞానిక ప్రదర్శన

యడ్లపాడు: ఈనెల 28వ తేదీన జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని మైదవోలు మండల బీసీ ప్రాథమిక పాఠశాలలో సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు పాఠశాల హెచ్‌ఎం జీవీ హేమలత చెప్పారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తారన్నారు. ఆమెతో పాటు డీవైఈఓ షేక్ సుభాని, యడ్లపాడు ఎంఈఓ 1,2లు ఎంవీ నాగరత్నం, ఎం.అరుణకుమారి, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ కేవీ రామిరెడ్డి హాజరుకానున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఇతర పాఠశాలల ఉపాధ్యాయులు హాజరై ఈ ప్రదర్శనశాలను విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ వైరు తెగిపడి జొన్న పైరు దగ్ధం

10 ఎకరాల్లో రూ.5 లక్షలు నష్టం

శావల్యాపురం: మండలంలోని పిచికలపాలెం గ్రామానికి చెందిన రైతు దుగ్గెంపూడి రామాంజినేయులకు చెందిన జొన్న పంట విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమై రూ.5 లక్షల నష్టం వాటిల్లిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. రైతు తెలిపిన వివరాలు మేరకు కనమర్లపూడి గ్రామం పెదకంచర్ల కాల్వ పరిధిలోని 12 ఎకరాలు కౌలుకు తీసుకొని గడ్డి జొన్న పంట సాగు చేశాడు. వారం రోజుల వ్యవధిలో చేతికివచ్చే సమయానికి విద్యుత్ వైరు పొలంలో తెగిపడి పంట సుమారు 10 ఎకరాల్లో తగలబడింది. ఈక్రమంలో పొలంలో జొన్న పంట అంతా కాలిపోయింది. పక్కపొలం రైతు సమాచారం ఇవ్వగా హుటాహుటిన రైతులు పొలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. కనమర్లపూడి లైన్‌మెన్ వచ్చి విద్యుత్ సరఫరా నిలుపుదల చేశాడు.



చిలకలూరిపేట చౌత్రా సెంటర్ శివాలయంలో స్వామివారి మూల విరాట్



పాతూరు శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



కేదారేశ్వరస్వామి దేవాలయంలో భక్తులతో పూజలు అందుకున్న స్వామివారు



అల్పాహారం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్



చిలకలూరిపేట అడ్డరోడ్డు వద్ద అన్నదానం నిర్వహిస్తున్న మాజీ మంత్రి విడదల రజిని

శంభో శివ శంభో..!

- నరసరావుపేటలో మహాశివరాత్రి వేడుకలు
- భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు
- కోటప్పకొండకు తరలిన భక్తులు, ప్రభలు
- భక్తులకు ఉచిత ప్రసాదం పంపిణీ చేసిన పలు స్వచ్ఛంద సంస్థలు



వితంరాజుపల్లి చిన్న షిరిడీలో ప్రత్యేక హోమాలు చేస్తున్న హిమాలయ గురువు



నరసరావుపేట నుంచి కోటప్పకొండకు తరలి వెళుతున్న భారీ తడికె ప్రభ



ఉప్పలపాడులో కొండకు వెళ్లే ప్రభను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: మహాశివరాత్రి సందర్భంగా హర హర మహదేవా.. శంభో శంకరా..చేదుకో... కోటయ్య అంటూ నరసరావుపేట పట్టణం, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు త్రికోటేశ్వరుడి సన్నిధి కోటప్పకొండకు బుధవారం తరలి వెళ్లారు. అదేవిధంగా తెల్లవారుజాము నుంచే పట్టణంలోని శివాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. సుమారు 200ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన గంగా పార్వతీ సమేత భీమలింగేశ్వరస్వామి దేవస్థానం (పాతూరు శివాలయం)కు భక్తులు పోటెత్తారు. సుమారు 15వేలమంది దర్శనం చేసుకొని ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారని ఆలయ నిర్వాహకులు మద్ది బాలసుబ్రమణ్యం, తవ్వా వెంకటేశ్వరరావు, చేగు వెంకటేశ్వరరావు వెల్లడించారు. అలాగే భక్తులు పట్టణ నడిబొడ్డున ఉన్న శివుని ఐలాండ్‌లోని శివుడిని దర్శించుకొని కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. వల్లప్ప చెరువు వద్దనున్న శ్రీ కేదారేశ్వరస్వామి వారి దేవస్థానంలో భక్తులు స్వామివారిని దర్శించుకొని అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి పట్టణం నుంచి భారీ తడికె ప్రభలు కోటప్పకొండకు తరలి వెళ్లాయి. అలాగే సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆర్టీసీ డిపోకు భక్తుల తాకిడి పెరిగింది. త్రికోటేశ్వరుడిని దర్శించుకునేందుకు పట్టణం గుండా కొండకు వెళ్లే భక్తులకు పలు స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా అల్పాహారం అందజేశారు. పచ్చిపులుసు సోదరులు విజిటేబుల్ పలావ్ పంపిణీ చేశారు.

ఉప్పలపాడు ప్రభను ప్రారంభించిన గోపిరెడ్డి

అలాగే కోటప్పకొండ తిరునాళ్లకు సిద్ధమైన ఉప్పలపాడు గ్రామ ప్రభకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కొబ్బరికాయ కొట్టి, పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. ప్రభ కమిటీ పెద్దలు, వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామప్రజలు పాల్గొన్నారు. అలాగే కొండకు వెళ్లేదారిలోని యల్లమంద గ్రామం వద్ద నబీ అబ్దుల్లా చారిటబుల్ సొసైటీ వ్యవస్థాపకులు షేక్ నబీబాజీ భక్తులకు ఉచితంగా మజ్జిగ, తాగునీరు అందజేశారు.

కోటప్పకొండకు తరలిన భక్తులు

చిలకలూరిపేట: చిలకలూరిపేట పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు కోటప్పకొండ తిరునాళ్లకు బుధవారం తరలివెళ్లారు. ఉదయం నుంచే కోటప్పకొండకు వెళ్లే జనసందోహం రోడ్లపై కనిపించింది. మధ్యాహ్నం నుంచి కొండకు వెళ్లే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. భక్తులు కొండకు వెళ్లేందుకు ఆర్టీసీ 105 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది.

కిటకిటలాడిన శివాలయాలు...

మహాశివరాత్రి సందర్భంగా పట్టణంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కళామందిర్ సెంటర్‌లోని గంగా బాలా త్రిపుర సుందరి సమేత నాగేశ్వరస్వామి ఆలయం, చౌత్రాసెంటర్‌లోని ఉమామహేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. మండలంలోని యడవల్లి, గోవిందపురం, లింగంగుంట్ల, మురికిపూడి, పసుమర్రు, వేలూరు గ్రామాల్లోని శివాలయాల్లో తెల్లవారుజాము నుంచి స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

స్వచ్ఛంద సంస్థల చేయూత...

కోటప్పకొండకు తరలివెళ్లే భక్తులకు రాజకీయ పార్టీలు, పలు స్వచ్ఛంద సంస్థలు, మిత్ర బృందాల ఆధ్వర్యంలో సేవలందించారు. వివిధ పార్టీలు, సంస్థల ఆధ్వర్యంలో కొండకు వెళ్లేమార్గంలో అన్నదానం, అల్పాహార కేంద్రాలతో పాటు మంచినీటి చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. వీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన శిబిరాన్ని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విడదల రజిని ప్రారంభించారు. శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అల్పాహార కేంద్రాన్ని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ ప్రారంభించారు. రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. లయన్స్ క్లబ్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ముదిరాజ్ యువసేన, కాపు, బలిజ, తెలగ, ఒంటరి సేవా సంఘం, మల్లెల రాజేష్ ఫౌండేషన్, సీపీటీ సోల్జర్స్, ఆరా ఫౌండేషన్, రజక జన సేవా సంఘం ఇలా పలు సంఘాల ఆధ్వర్యంలో అల్పాహారం, చలివేంద్ర కేంద్రాలు ఏర్పాటు చేశారు.

మొక్కుబడి విద్యుత్ ప్రభ తరలింపు..

శావల్యాపురం: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని మండలంలోని పోట్లూరు గ్రామం నుంచి కోటప్పకొండ తిరునాళ్ల సందర్భంగా కొన్ని సంవత్సరాల నుంచి మొక్కుబడి విద్యుత్ ప్రభను గ్రామస్తులు ఏర్పాటు చేయటం ఆనవాయితీగా వస్తుంది. మహాశివరాత్రి పర్వదినం ముందురోజు గ్రామంలో విద్యుత్ ప్రభను ఊరేగించి తరలించారు.

వినుకొండలో...

వినుకొండ: మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని పట్టణం, మండలంలోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. పట్టణంలోని ప్రసన్న రామలింగేశ్వరస్వామి ఆలయం, మంజునాథ ఆలయం, శ్రీనివాసనగర్‌లోని కైలాశ్వేశ్వర ఆలయం, కమఠేశ్వర ఆలయం తదితర ఆలయాల్లో భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. వితంరాజుపల్లి సమీపంలో గల శాంతిఆశ్రమం ట్రస్ట్‌లో చిన్నషిరిడీలో హిమాలయ గురూజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి హోమం, రుద్రహోమం, మృత్యుంజయ హోమం, పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. భక్తులు వేలాదిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం చేపట్టారు. పార్వతీపరమేశ్వరుల కళ్యాణం నిర్వహించారు. శాంతి ఆశ్రమ ట్రస్ట్ అధ్యక్షుడు పెండేల వెంకటమోహన్‌రావు, కె. అనంత కోటేశ్వరరావు, పెండేల కాశీ, కొప్పురావూరి సుధాకర్, పెండేల పుల్లారావు, మునిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా మన్నేపల్లెయ్య స్వామి తిరునాళ్ల



మన్నేపల్లి లక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

బొల్లాపల్లి: నల్లమల అటవీ ప్రాంతంలోని మన్నేపల్లి తండా సమీపంలో స్వయంభూగా వెలసిన శ్రీ మన్నేపల్లెయ్య తిరునాళ్ల బుధవారం ఘనంగా నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినాన దేవాలయాలన్నీ శివనామస్మరణతో మార్మోగుతుంటే ఇక్కడ లక్ష్మీనరసింహస్వామి, వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు జరపడం ప్రత్యేకత. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల సరిహద్దులో మన్నేపల్లెయ్య స్వామి ఆలయం ఉండటంతో ఆయా జిల్లాల్లోని పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి కల్యాణ వేడుకలను వీక్షించారు. ఆలయంలో రెండు విద్యుత్ ప్రభలు కొలువుతీరాయి. ఆలయ కమిటీ పలు సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పలు స్వచ్ఛంద సంస్థలు అన్నసంతర్పణ చేశారు. భక్తులు పొంగళ్లతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వినుకొండ, మార్కాపురం, మాచర్ల డిపోల నుంచి బస్సు సర్వీసులు నడిపారు. బండ్లమోటు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా మహాశివరాత్రి..

మండల ప్రజలు మహాశివరాత్రి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని వడ్డెంగుంట, వెల్లటూరు గ్రామాల్లో వెలసిన శ్రీ జ్ఞానప్రసూనాంబ కాళహస్తీశ్వరస్వామి, పార్వతి సమేత సోమేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. వడ్డెంగుంట శ్రీ జ్ఞానప్రసూనాంబ కాళహస్తీశ్వరస్వామి ఆలయంలో భారీ అన్నసంతర్పణ చేశారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెం, కారుమంచి, వేల్పూరు, మతుకుమల్లి, పోట్లూరు, కొత్తలూరు, శావల్యాపురం తదితర గ్రామాల్లో మహాశివరాత్రి పర్వదినం వేడుకలు భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో తెల్లవారుజాము నుంచి శివాలయాల్లో శివుని దర్శించుకొని భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. మండల కేంద్రం శావల్యాపురంలో వేంచేసియున్న శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయాల్లో భక్తులు శివలింగానికి విశేష పూజలు నిర్వహించారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: మహాశివరాత్రి ఉత్సవాలు మండలంలో భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగాయి. ఉదయాన్నే భక్తులు శైవాలయాలకు చేరుకుని స్వామివారి దర్శనం చేసుకున్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. ప్రసిద్ధ శైవక్షేత్రం కోటప్పకొండలోని త్రికోటేశ్వరస్వామి దేవాలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివెళ్లారు. గణపవరం పరిధిలోని సాయిబాబా సేవాశ్రమం ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం అల్పాహార పంపిణీ శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు యూవీ శివరామయ్య, శిఖాకొల్లి పాపారావు, సభ్యులు పాల్గొన్నారు. చిరుమామిళ్లలోని శ్రీ కోటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం చేశారు.

నూజెండ్లలో...

నూజెండ్ల: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని నూజెండ్ల మండలంలోని శివాలయాలు శివనామ స్మరణతో మారుమోగాయి. బుధవారం మండలంలోని రవ్వవరం, వి.అప్పాపురం, అయినవోలు తదితర గ్రామాల్లోని శివాలయాల్లో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. రవ్వవరం కాల్వ వద్ద వేంచేసియున్న అమ్మవారి దేవాలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.



నరసరావుపేట నుంచి కోటప్ప కొండకు తరలివెళుతున్న ప్రభ



గంటావారిపాలెంలో ప్రత్యేక అలంకరణలో శివలింగం



ప్రత్యేక అలంకరణలో చిరుమామిళ్ల కోటేశ్వరస్వామి

కిటకిటలాడిన ఆలయాలు..

నరసరావుపేట ఈస్ట్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని శైవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం ఆయా ఆలయాలలో అభిషేకాలు, అలంకరణలు నిర్వహించి భక్తులను దర్శనాలకు అనుమతించారు. పాతూరులోని శ్రీభీమలింగేశ్వరస్వామి ఆలయం, బరంపేటలోని శ్రీవాయు మల్లేశ్వరస్వామి, రావిపాడు రోడ్డులోని కళ్యాణ సుందరేశ్వరస్వామి ఆలయం, వల్లప్పచెరువురోడ్డులోని శ్రీకేథారేశ్వర స్వామి ఆలయం, శ్రీశృంగేరీ శంకరమఠం తదితర ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. అర్ధరాత్రి 12గంటల సమయంలో లింగోద్భవ ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్టు అర్చకులు తెలిపారు. త్రికోటేశ్వరస్వామి సన్నిధిలో నిర్వహించే జాగరణకు పట్టణం నుంచి ప్రభలు తరలి వెళ్లాయి. ప్రభల పండుగగా జరుపుకొనే కోటప్పకొండ తిరునాళ్లకు పట్టణంతో పాటు సమీప గ్రామాల నుంచి ప్రభలు కోలాహలంగా వెళ్లాయి. తీన్‌మార్ డప్పులతో యువత సందడి చేసుకుంటూ కొండకు వెళ్లారు.

బైక్‌ను ఢీకొన్న కారు



ప్రమాదానికి కారణమైన కారు



ధ్వంసమైన బైకును పరిశీలిస్తున్న పోలీసులు

ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురం గ్రామ సమీపాన పెట్రోలు బంకు పరిధి గుంటూరు–కర్నూలు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాలు మేరకు.. నూజెండ్ల మండలం ఐనవోలు గ్రామానికి చెందిన కొల్లిబోయిన వీరాంజినేయులు, కొత్తపాలెం గ్రామానికి చెందిన కత్రివేముల సురేష్‌లు ఇరువురు కోటప్పకొండ తిరునాళ్ల చూసుకుని తిరిగి తమ తమ స్వగ్రామాలకు ఒకే బైకుపై వస్తున్నారు. ఈక్రమంలో కనిగిరి నుంచి పిడుగురాళ్ల మండలం పిన్నెల్లి గ్రామానికి తన అత్త ఇంటికి కారులో అన్నదమ్ములైన చందాని, నజీమ్‌లు బయలుదేరారు. మార్గమధ్యంలో పెట్రోలు బంకు సమీపానికి రాగానే కారు అతి వేగంతో బైకును ఢీకొట్టింది. ఈసంఘటనలో బైకుపై వస్తున్న ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు కాగా 108 అత్యవసర వాహనంలో వైద్యశాలకు తరలించారు. కారు అతి వేగంతో నడపటం వలన ప్రమాదం చోటుచేసుకుందని స్థానికులు గుర్తించి ఇరువురు వ్యక్తులకు దేహశుద్ధి చేస్తుండగా పోలీసులు గుర్తించి పోలీసు స్టేషనుకు తరలించారు. కారులోని బెలూన్ సైతం ఓపెన్ కావటం మరో వైపు రోడ్డు పక్కనే ఏర్పాటు చేసిన సిగ్నల్ బోర్డును ఢీకొట్టటం పెను ప్రమాదం తప్పిందని పోలీసులు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్ అంతరాయం వాటిల్లికుండా చర్యలు తీసుకున్నారు. దెబ్బతిన్న వాహనాలను పోలీసు స్టేషనుకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

నూజెండ్ల: లక్ష్యాలను నిర్దేశించుకొని చదివితే ఉన్నత స్థాయికిచేరుకోవచ్చని గంగినేని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగినేని రాఘవరావు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన నూజెండ్లలో కస్తూర్బా విద్యాలయంలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ పి.ఉమాదేవి, సీడీపీఓ ఎం.అనురాధ, ప్రిన్సిపాల్ ఉషారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

మాచర్ల: పట్టణంలో బస్టాండ్ సెంటర్‌లో గల వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం స్వామివారి మూల నక్షత్రం పురస్కరించుకుని కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు స్వామిని ప్రత్యేకలంగా అలంకరించి, పూజలు జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఏర్పాట్లను ఆలయ, కల్యాణ నిర్వహణ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

పూర్తయిన పోలింగ్ బూత్‌ల ఏర్పాటు



క్రోసూరు: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం జరుగుతున్న నేపథ్యంలో పోలింగ్ బూత్‌ల ఏర్పాటు ప్రక్రియ పూర్తయినట్లు ఆయా బూత్‌ల పోలింగ్ అధికారులు ఎం.శేఖర్, శ్రీను నాయక్‌లు బుధవారం తెలిపారు. క్రోసూరు జెడ్పీ పాఠశాలలో ఎన్నికల ఓటింగ్ కొరకు రెండు బూత్‌లు ఏర్పాటు చేశారు. మండలంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్లు 1,548 మంది ఉన్నారు. ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు ఇద్దరు పీవోలు, ఇద్దరు ఏపీవోలు, రూట్ అధికారులుంటారని తెలిపారు. ఇదిలా ఉండగా ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకొనేందుకు పోలీసులు 144, 30 ఏ యాక్ట్ అమలు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగేంద్రరావు తెలిపారు. పోలింగ్ బూత్‌ల వద్ద 100 నుంచి 200 మీటర్ల పరిధి వరకు పోలీసు చట్టం అమలులో ఉంటుందన్నారు. ఈ పరిధిలో దుకాణాలు, వ్యాపార సముదాయాలు, ప్రజలు గుంపులు గుంపులుగా గుమిగూడటం, మద్యం విక్రయాలు నిషేధమని ఎస్‌ఐ తెలిపారు. చట్ట విరుద్ధంగా ప్రవరిస్తే పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

వైభవంగా సాయిబాబా మందిరం వార్షికోత్సవం



పిడుగురాళ్ల: మండలంలోని కోనంకిలో గల సాయిబాబా మందిరం 7వ వార్షికోత్సవాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, పల్నాడు హాస్పిటల్ అధినేత డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. అందరి ఆరాధ్య దైవం సాయిబాబా అని పేర్కొన్నారు. అనంతరం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వీరభద్రుని రామిరెడ్డి, గ్రామ పెద్దలు కలిసి అశోక్‌కుమార్‌ను సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ పూజారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.